# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 24-04-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- దేశ ఆర్థిక అభివృద్ధిలో బ్యాంకింగ్ రంగానిది ముఖ్య పాత్ర అని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు.
- గ్రామ పంచాయతీలలో సమగ్ర అభివృద్ధి లేకుండా వికసిత భారత్ కలను సాకారం చేయడం సాధ్యం కాదని కేంద్ర సహాయ మంత్రి ఎస్.పి. సింగ్ బాఘేల్ అన్నారు.
- దేశ అభివృద్ధిలో సముద్ర రంగం కీలక పాత్ర పోషిస్తుందని కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్ తెలిపారు.
- ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 133వ సంచిక ఈ ఆదివారం ప్రసారమవుతుంది.

= = = = = = = = = = = = = = = = = = =

దేశ ఆర్థిక అభివృద్ధిలో బ్యాంకింగ్ రంగానిది అతి ముఖ్య పాత్ర అని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. దేశ ఆర్థిక స్థిరత్వానికి బ్యాంకింగ్ రంగం ఎంతగానో దోహదపడుతోందని ఆమె తెలిపారు. పూణేలో భారతీయ స్టేట్ బ్యాంక్, మహారాష్ట్ర ప్రాంతీయ ప్రధాన కార్యాలయం ప్రారంభోత్సవంలో ఆమె ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మాట్లాడుతూ, ప్రపంచ ఆర్థిక అభివృద్ధి విస్తరణను స్థానిక అవసరాలకు అనుసంధానించినప్పుడే బ్యాంకింగ్ రంగంలో అర్థవంతమైన పురోగతిని సాధించగలమని కేంద్ర మంత్రి చెప్పారు. డిజిటల్ బ్యాంకింగ్, కృత్రిమ మేధ (ఏఐ) బ్యాంకింగ్ రంగాన్ని మారుస్తున్నప్పటికీ ప్రత్యక్ష మానవ సంబంధాలను కోల్పోకూడదని సూచించారు. వ్యవసాయం, తయారీ, సేవలు, పర్యాటకం సమాచార సాంకేతికత వంటి కీలక రంగాలతోనే దేశీయ ఆర్థిక వృద్ధి ఆధారపడి ఉంటుందని నిర్మలా సీతారామన్ వెల్లడిస్తూ...

(వాయిస్...30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

గ్రామ పంచాయతీలలో సమగ్ర అభివృద్ధి లేకుండా వికసిత భారత్ కలను సాకారం చేయడం సాధ్యం కాదని కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ సహాయ మంత్రి ఎస్.పి. సింగ్ బాఘేల్ పేర్కొన్నారు. జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా ఈరోజు జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ, జాతీయ పురోగతికి క్షేత్రస్థాయిలో సమ్మిళిత వృద్ధి అత్యంత ఆవశ్యకమని తెలిపారు. పాలన సామర్థ్యాన్ని పెంచడంతో పాటు క్షేత్ర స్థాయి వరకు సేవలను ప్రజలకు అందించే విధానాన్ని మెరుగుపరచడానికి కేంద్ర ప్రభుత్వం గణనీయమైన కృషి చేసిందని కేంద్ర మంత్రి చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న అనేక నిర్ణయాల ఫలితంగా వివిధ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు క్షేత్రస్థాయి ప్రజలకు మరింత విస్తృతంగా చేరుతున్నాయని గుర్తు చేశారు. ప్రత్యక్ష ప్రయోజన బదిలీ వంటి విధానాల ద్వారా లబ్ధిదారులకు ఆర్థిక సహాయం నేరుగా అందేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందని ఆయన వివరించారు. గ్రామస్థాయిలో ప్రజలకు ప్రభుత్వ పథకాలు సమర్థవంతంగా అందేలా చూడాలని పంచాయతీలకు ఎన్నికైన ప్రజా ప్రతినిధులకు ఆయన విజ్ఞప్తి చేశారు.

= = = = = = = = = = = = = = = = = = =

దేశ అభివృద్ధిలో సముద్ర రంగం కీలక పాత్ర పోషిస్తోందని కేంద్ర ఓడరేవులు, నౌకా రవాణా జలమార్గాల శాఖా మంత్రి సర్బానంద సోనోవాల్ తెలిపారు. న్యూఢిల్లీలోని ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో సముద్రయాన విద్యపై జరిగిన ఒక సమావేశంలో ఆయన ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 11 వేల కిలోమీటర్లకు పైగా తీర ప్రాంతం, 111 జాతీయ జలమార్గాలు దేశంలో ఉన్నాయని చెప్పారు. దేశంలో సముద్ర రంగాన్ని బలోపేతం చేయడం కేవలం ఒక అవకాశం మాత్రమే కాదని, జాతీయ అవసరం అని అభిప్రాయపడ్డారు. దేశ ఆర్థిక వృద్ధిని నడిపించడంలో సముద్ర రంగం ప్రధాన పాత్ర పోషిస్తోందని కేంద్ర మంత్రి పేర్కొంటూ...

(వాయిస్…32 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ ఆదివారం ఉదయం 11 గంటలకు ఆకాశవాణిలో ప్రసారమయ్యే 'మన్ కీ బాత్ - మనసులో మాట' 133వ సంచిక కార్యక్రమంలో దేశ ప్రజలతో తన భావాలను పంచుకుంటారు. ఈ కార్యక్రమం ఆకాశవాణి, దూరదర్శన్ నెట్‌వర్క్ అంతటా, AIR News వెబ్‌సైట్ మరియు 'News on air' మొబైల్ యాప్‌లో ప్రసారమవుతుంది. అలాగే, AIR News, DD News, PMO.. సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖల YouTube ఛానెళ్లలో కూడా ఇది ప్రత్యక్ష ప్రసారం చేయబడుతుంది. హిందీ ప్రసారం ముగిసిన వెంటనే, ఆకాశవాణి ఈ కార్యక్రమాన్ని ప్రాంతీయ భాషల్లో ప్రసారం చేస్తుంది.

= = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = =

నిర్దేశించుకున్న లక్ష్యాలు, సంక్షేమ కార్యక్రమాల ద్వారా సమాజంలోని అన్ని వర్గాలకు సమ్మిళిత అభివృద్ధి, సామాజిక న్యాయం అందించడానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖా మంత్రి డాక్టర్ వీరేంద్ర కుమార్ అన్నారు. షెడ్యూల్డ్ కులాలకు చెందిన విద్యార్థులకు అనేక పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ఇందులో భాగంగా 2025-26 ఆర్థిక సంవత్సరంలో 75 లక్షలకు పైగా ఉన్న షెడ్యూల్డ్ కులాల విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం 7వేల 981 కోట్ల రూపాయలను పంపిణీ చేసిందని చెప్పారు. అలాగే ఓబీసీలు, సీనియర్ సిటిజన్లు, ట్రాన్స్‌జెండర్ లు, పారిశుద్ధ్య కార్మికులు, ఆర్థికంగా బలహీన వర్గాల వారికోసం వివిధ చట్టాల ద్వారా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని కేంద్ర మంత్రి తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = =

దేశంలో డీజిల్ ధరలు పెరగలేదని పెట్రోలియం సహజ వాయువుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి సుజాత శర్మ స్పష్టం చేశారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన అంతర్-మంత్రిత్వ శాఖల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. పశ్చిమ ఆసియాలో చోటు చేసుకున్న పరిస్థితుల నేపథ్యంలో దేశీయ ఎల్పీజీ సరఫరాకు సైతం ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని అన్నారు. ముడి చమురు నిల్వలు సరిపడా ఉన్నాయని, రిఫైనరీలు గరిష్ట సామర్థ్యంతో పనిచేస్తున్నాయని తెలిపారు. దేశంలో పెట్రోల్, డీజిల్ సరఫరాలు కూడా సరిపడా ఉన్నాయని ప్రజలు భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని సుజాతా శర్మ పేర్కొంటూ...

(వాయిస్…30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

అణగారిన వర్గాల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని సీనియర్ బీజేపీ నాయకుడు, ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలిపారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం దక్షిణ 24 పరగణాల జిల్లాలోని బరుయిపూర్‌లో ఈరోజు జరిగిన ఎన్నికల ర్యాలీలో ఆయన ప్రసంగిస్తూ, ప్రధానమంత్రి ఉజ్వల యోజన కింద దక్షిణ 24 పరగణాల జిల్లాకు 11 లక్షల ఎల్‌పిజి కనెక్షన్లు అందించామని చెప్పారు. ఇందులో 3 లక్షల షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు చెందినవారికి అందాయని తెలిపారు. ఈ సామాజిక వర్గాల కోసం కేంద్ర ప్రభుత్వం అనేక ఇతర సంక్షేమ చర్యలను కూడా అమలు చేసిందని ప్రధానమంత్రి గుర్తు చేశారు. పశ్చిమ బెంగాల్ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం చిత్త శుద్ధితో ఉందని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = =

న్యూఢిల్లీలోని కర్తవ్య పథ్‌లో నూతనంగా నిర్మించిన కర్తవ్య భవన్-2లో న్యాయశాఖకు సంబంధించిన కొత్త కార్యాలయాన్ని కేంద్ర న్యాయశాఖా మంత్రి అర్జున్ రామ్ మేఘువాల్ ఈరోజు ప్రారంభించారు. కొత్త కార్యాలయం

పనితీరులో మరింత సామర్థ్యాన్ని పెంపొందిస్తుందని, అలాగే ప్రజా సేవ స్ఫూర్తికి నూతన ఉత్సాహాన్ని అందిస్తుందని సామాజిక మాధ్యమం ద్వారా పెట్టిన పోస్టులో ఆయన పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = =

ఐపీఎల్ లో భాగంగా బెంగళూర్ లోని చిన్నస్వామి స్టేడియం వేదికగా గుజరాత్ టైటన్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచిన బెంగళూరు జట్టు బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ ప్రారంభించిన గుజరాత్ టైటన్స్ జట్టు 12 ఓవర్లు పూర్తయ్యేసరికి 121 పరుగులు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు భారీ నష్టాల్లో ముగిశాయి. ఉదయం స్వల్ప నష్టాలతో ప్రారంభమైన సెన్సెక్స్.. చివరికి 982.71 పాయింట్ల నష్టంతో 76 వేల 681 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 275 పాయింట్లు నష్టపోయి 23 వేల 897 వద్ద స్థిరపడింది.

= = = = = = = = = = = = = = = = = = = =

టెలికాం రంగంలో సంస్కరణల కారణంగా ఆశించిన ప్రయోజనాలు లభిస్తున్నాయని కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్ర శేఖర్ చెప్పారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన COAI డిజికామ్ సమ్మిట్-2026లో ఆయన ప్రసంగిస్తూ, 6G, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం వంటి సాంకేతికతలు కమ్యూనికేషన్ రంగంలో నూతన మార్పులను తీసుకుని వస్తాయని అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = =